

# బామ్మ ఎక్కడ ఉండాలి?

టి.వి. కళ్యాణి



"అత్తయ్యా! మీ బామ్మనీ చూపించవూ!"

"చూపిస్తానమ్మా! నువ్వు ఊరు వెళ్ళేలోగా తప్పకుండా చూపిస్తాను."

"రోజూ అలాగే అంటున్నావు, ఈ రోజు వెళ్దాం." బుంగమూతి పెట్టి అడిగింది రజిత.

"అలాగేలే! అమ్మమ్మని అడుగు."

నా మాట వింటూనే పరుగెత్తింది అమ్మమ్మ దగ్గరికి.

పదేళ్ల రజిత ఆడపడుచు కూతురు. వారం రోజుల క్రితం పనుందని ఊరు వెళ్తూ రజితను మా దగ్గర వదిలి వెళ్లారు. ఆవిడ వెళ్లిన మరునాడే మా అత్తగారి ప్రాణ స్నేహితురాలు కమల రావడంతో బయటికి తిరగడం, కబుర్లు, సందడిగా నాలుగురోజులు అమ్మమ్మ వెనకాలే తిరుగుతూ గడిపేసింది రజిత. ఆవిడ ఉన్నప్పుడే మా బామ్మ గురించి అడిగి, మా బామ్మ కబుర్లు విని చాలా ఆనందించి, మా అత్తగారితో "ఎంత అదృష్టమే, రాజీ, మీ వియ్యపురాలి అత్తగారిది! వృద్ధాప్యంలో కూడా ఇంత సంతోషంగా నా వాళ్లతో గడపగలుగుతోంది. ఏనాడో పెట్టి పుట్టింది!" అన్నారు.

"అన్నట్టు నీ కో విషయం చెప్పడం మరిచానే కమలా! మా వాడి పెళ్లి కుదరడానికి మూలకర్త ఆవిడే!" అని అప్పటి సంఘటన చెప్పారు మా అత్తగారు.

అస లేం జరిగిందంటే -

మా ఇంటికి పెళ్లి చూపులకు మా కాబోయే అత్తగారు, మామగారు వాళ్లబ్బాయితో సహా వచ్చారు. వాళ్లతో మాట్లాడుతూ చుట్టరికాలు తిరగేసి వాళ్లకీ, మాకూ బీరకాయ పీచు బంధుత్వ ముందని, మా కాబోయే అత్తగారు కూతురు వర సవుతుందని మా బామ్మ చుట్టరికం కలిపేసింది. మా బామ్మ మాటల్లో గల ఆప్యాయత ఎదుటివారిని అయస్కాంతంలా ఆకర్షించి అర నిముషంలో ఆత్మబంధువులని చేసేస్తుంది. అది మా అత్తవారి పట్ల రుజువయింది. మా బామ్మతో పరిచయం అయినందుకు చాలా సంతోషించి వెళ్లిపోయారు.

నాలుగు రోజుల తర్వాత వాళ్ల ఇంటి పురోహితులు శాస్త్రులు గారిని మధ్యవర్తిగా పిల్ల నచ్చిందని చెప్పి పంపారు.

శాస్త్రులు గారు మా ఇంటికి వచ్చి పిల్ల నచ్చిందని, పాతికవేలు కట్నం, అత్తగారు, ఆడపడుచుల లాంఛనాలు జరిపి, పెళ్లి అట్టహాసంగా చేయాలని చెప్పారు. నాన్నగారు తరువాత కబురు పెడతానని శాస్త్రులు గారిని పంపించేశారు.

నాన్నగారికి కట్నం ఇవ్వడం, పుచ్చుకోవడం - రెండూ ఇష్టం లేదు. అమ్మా, బామ్మా - "నిక్షేపం లాంటి సంబంధం! కట్నం కోసం

వదులుకుంటామా? మన కేం లేదా, పోదా? ఇచ్చి చేద్దాం!" అని నెత్తీ నోరూ బాదుకున్నారు. అయినా నాన్నగారు పట్టించుకోలేదు.

ఆఖరికి బామ్మ నా దగ్గరికి వచ్చి, "పిల్లాడు నచ్చితే ధైర్యంగా 'ఆ అబ్బాయినే' చేసుకుంటానని మీ నాన్నకి చెప్పు" అంది.

"అబ్బాయి నచ్చినా సరే, పాతిక వేలు పెట్టి కొనుక్కోను బామ్మా!" అని కచ్చితంగా చెప్పేశాను.

అంతే, చర్రున లేచింది - "కట్నం ఇవ్వడమంటే కొనుక్కోవడమే నేమిటి? ఇదేమన్నా బజారులోని వస్తువా?" అంటూ.

"కొడుక్కి కట్నం తీసుకోవడమంటే అమ్ముకోవడం అని ఆ రోజుల్లోనే తాతయ్యగారు నిన్ను ఒప్పించి నాన్నగారి పెళ్లి కట్నం లేకుండానే, ఘనంగా జరిపించారని గొప్పగా చెబుతున్నావు కదా! అటువంటిది ఈ రోజుల్లో కట్నం పుచ్చుకోని పెళ్లికొడుకు దొరక డంటావా?" అన్నాను.

దాంతో బామ్మ చల్లబడి, 'ఏ దొచ్చినా మన మంచికే!' అని సరిపెట్టుకుని వదిలేసింది.

ఆ తరువాత రెండు రోజులకు నా పుట్టినరోజు. ఆ రోజు మాత్రం మా బామ్మ ఇష్ట ప్రకారం ముస్తాబై మా బామ్మతో గుడికి వెళ్లిరావడం అలవాటు. నాగరం పెట్టి జడ కుచ్చుతో జడ వేసింది అమ్మ. పట్టు చీర కట్టి, కాసుల పేరు మెళ్లో వేసుకుని, చెవులకు జూకాలు, కాళ్లకు పట్టీలు, చేతినిండా గాజులు - అలా ఉంటే మా బామ్మ కళ్లకి మహాలక్ష్మిలా కనిపిస్తాను మరి! గుడికి వెళ్లే ముందు తమ్ముడు చూసి, "అమ్మా! రేపు పేపరులో అమ్మవారు గుళ్లో తిరిగిందని వార్త రాకపోతే చూడు!" అని వేళాకోళం ఆడటం మొదలుపెట్టాడు.

నేనూ, బామ్మా గుడికి వెళ్లాం. దైవ దర్శనం, ప్రదక్షిణాలు - అన్నీ అయ్యాక మండపంలో కూర్చున్నాం. మమ్మల్ని చూసి, మా కాబోయే అత్తగారు, వాళ్లబ్బాయి మా దగ్గరకు వచ్చారు. ఆవిడే మా బామ్మని చూసి, "బాగున్నారా పిన్నీ!" అంటూ పలకరించింది.

"అయ్యో, అమ్మడూ, నువ్వటే!" అంటూ సంబరంగా మా బామ్మ మాట కలిపింది.

కొంతసేపటికి ఆవిడే "శాస్త్రులు గారికి ఏ మాటా చెప్పలే దేం పిన్నీ!" అని ఉండబట్టలేక అడిగేసింది.

"ఏం చెప్పనే తల్లీ! మీ సంబంధం మా అందరికీ నచ్చింది. కానీ, ఏం లాభం? తండ్రీ కూతురూ కట్నానికి వ్యతిరేకం. ఇవ్వరుట, పుచ్చుకోరుట! నేనూ, నా కోడలూ నెత్తీ నోరూ బాదుకుని మరీ చెప్పాం - వా ళ్లడిగిన పాతికవేలూ ఇచ్చేయమని. మన కేం లోదా, పోదా! ఏ పదిమందికి పెట్టాలి గనుక, అయినా ఇష్టం లేకుంటే పుచ్చుకోవడం మానాలి గానీ, కట్నం ఇవ్వనంటే ఎలా? ఆడపిల్ల పెళ్లిరా అని అబ్బాయికి శత విధాల చెప్పాను. అబ్బే వినందే! పోనీ నా బంగారం ఇచ్చి పొలం రాసిస్తా నని చెప్పమన్నా. అయ్యో తల్లీ! మా పెత్తితే విరుచుకుపడుతున్నారు తండ్రీ, కూతురూ! అయినా మన చేతుల్లో ఏముందే తల్లీ! అంతా ఆ భగవంతుని లీల! అమ్మాయీ! బంధుత్వం మన మధ్య ఎప్పుడూ ఉంటుంది. సంబంధం కుదిరినా కుదరకపోయినా, నువ్వు నా కూతురు వరసే! అందుకని వస్తూ పోతూ ఉండు." సుదీర్ఘోపన్యాసం ఇచ్చేసింది బామ్మ.

"పిన్నీ! మీరు చెప్పింది నా కర్థం కాలేదు. మేము పాతిక వే లిమ్మని అడగటం ఏమిటి?" అంటూ తెల్లబోయిం దావిడ.

"బాగుందమ్మాయి నీ వరస! మీరు పంపిన పెద్దమనిషి పాతిక వేలు కట్నం, అత్తగారికి, ఆడబడుచుకు లాంఛనాలు ఇచ్చి, పెళ్లి ఘనంగా జరిపించాలని నా ముందే చెబుతే! అబ్బాయికి కట్నాలు ఇవ్వడం ఇష్టం లేదు కనుక తర్వాత కబురెడతాం అని శాస్త్రులు గారికి చెప్పి పంపించేశాడు" అంది బామ్మ.

"ఎక్కడో పొరపాటు జరిగింది. పిల్ల నచ్చింది, పెళ్లి ఘనంగా చెయ్యమని చెప్పమన్నాం అంతేగాని, కట్న కానుకల విషయమే ఎత్తలేదు. మీ అబ్బాయి, మనవరాలే కాదు, మేము కూడా కట్నానికి వ్యతిరేకులమే, రేపొకసారి మీ అబ్బాయిని పంపండి, మాట్లాడతాం!" అందావిడ.

మా బామ్మ సంబరపడిపోయి, "అలాగేనే అమ్మా! తప్పకుండా పంపిస్తాను" అని, "అమ్మడూ! రాజీకి దండం పెట్టు!" అని నాకు చెప్పి, "ఈ రోజు పిల్లదాని పుట్టినరోజు. అందుకని గుడికి వచ్చాం" అని చెప్పింది.

మా కాబోయే అత్తగారు మనసులోనే ఆశీర్వదిస్తే, వాళ్లబ్బాయి వినబడీ వినబడకుండా పుట్టినరోజు శుభాకాంక్షలు అందచేశారు.

ఇంటికి రాగానే ముందు అమ్మ చెవిన ఈ వార్త వేసి తన సంబరాన్ని పంచుకుని, నాన్నగారు గుమ్మంలో అడుగు పెట్టగానే చెప్పేసింది బామ్మ.

మర్నాడు నాన్నగారు వాళ్లింటికి వెళ్లేసరికి శాస్త్రులు గారు అక్కడే ఉన్నారు. దానా దీనా మొత్తం మీద తేలిం దేమిటంటే, శాస్త్రులు గారు మధ్యవర్తిగా ఆ రోజు నాలుగు సంబంధాల గురించి మాట్లాడారు - ఆ రోజు మంచిరోజని. అందులో మా నాన్నగారి పేరు ఎం.వి. రావు, మరొక ఆయన పి.వి. రావు. ఆయన వివరాలు సరిగానే రాసుకున్నా చెప్పడం వాళ్లిద్దరికీ తారుమారు చేశారు. వీళ్లు చెప్పేదాకా ఆయన పొరపాటు తెలిసిరాలేదుట. తెలిశాక రెండవ పెళ్లివారు కట్నం వద్దని చెప్పినందుకు గొడవ పెడతారని లబోదిబో మంటూ పరుగెత్తారట తన పొరపాటు దిద్దుకుందుకు!

అట్టహాసంగా మా పెళ్లి జరిగిపోయింది. పెళ్లిలో పచ్చగా దబ్బపండులా మెరిసిపోతూ, తెల్లని జరీ అంచులున్న పట్టు పంచె కట్టుకుని వచ్చిన వారినందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అపర అన్నపూర్ణలా అందరినీ భోజనాలు చేసి వెళ్లమని, వచ్చిన వారి యోగక్షేమాలు కనుక్కుంటున్న బామ్మ అటు మగపెళ్లివారికి కూడా ఆప్తబంధువైపోయింది. మా ఇంటికి వచ్చిన చుట్టాలూ, స్నేహితులూ అందరూ మా బామ్మని గురించి అడుగుతుంటారు.

కమల గారు వెళ్లిన దగ్గరనుంచి "అత్తయ్యా! నాకు బామ్మ ఉందా? ఎలా ఉంటారు? ఎక్కడ



## నరసింహుల వారి కోపకారణం

అపర కౌటిల్యుడిగా వినుతికెక్కిన మన ప్రధాని శ్రీ శ్రీ నరసింహుల వారి ముఖారవిందాన ఏ భావం ప్రస్ఫుటమవదు గాక అవ్వదు.

ఆయన ఆనందపడ్డారో, కోపగించుకుంటున్నారో, చికాకు పడుతున్నారో ఏమీ తెలియక జుట్టు పీక్కునే వారు ఆయన కార్యవర్గంలో చాలా మందే ఉన్నారట.


అయితే అందుకు విరుద్ధంగా ఇటీవల ఒక సంఘటన జరిగిందండోయ్!

ఈమధ్యనే శ్రీ శ్రీ ప్రధాన మంత్రి గారు అస్సామ్ వెళ్లి వచ్చారు కదా! వచ్చేటప్పుడు ఆయన తన చికాకును తన సిబ్బంది అందరికీ తెలిసేలా ప్రదర్శించేశారట.

పాపం ఎంత చికాకు కలిగించే విషయమో అనేసుకుని జాలిపడిపోకండి. సదరు సంఘటన స్వల్పమైనదే.

అస్సాంలోని మూల మూలలకూ వెళ్లి ప్రధాని గారు మీటింగ్ లెట్టేశారు. మీటింగ్‌లపుడు సిబ్బంది ఆయన చొక్కా చేతులు బట్టి లాగుతూ 'టైమయిపోతోంది సామీ' అని మొత్తుకుంటూ గడిపారట.

కారణమేమంటే. అక్కడ అస్సాంలో సాయంత్రం ఆరు గంటల తరువాత హెలీకాప్టర్ దిగడాన్ని ఎగురడాన్నీ అంగీకరించరు. అందుకే పాపం ఆయన సిబ్బంది తొందరపెట్టి శ్రీవారి కోపానికి గురయ్యారు.



**ఒక గులాబీ రెండు ముళ్ళు**

ఓసారి ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటయిన ఓ
విందులో జనతా పార్టీ నాయకుడు డా॥ సుబ్రహ్మణ్య
స్వామి పాల్గొన్నారు. ఆయన శ్రీమతి రోడా మిస్త్రీ
కుమారి కుముద్‌బెన్ జోషిల మధ్య కూర్చోవల్సి
వచ్చింది. వారిద్దరి మధ్య కూర్చున్న స్వామిని
చూచి పలకరించటానికి వచ్చిన ప్రధాని శ్రీమతి
ఇందిరాగాంధీతో రోడా మిస్త్రీ "రెండు గులాబీల
మధ్య ముల్లు ఉన్నది" అన్నదిట.
"లేదు రోడా! రెండు ముళ్లమధ్యనే గులాబీ
చిక్కుకున్నదని నా అభిప్రాయం" అని
చమత్కరించారట ఇందిరాగాంధీ చిరునవ్వుతో.

[బద్దిగం పాండురంగారెడ్డి],[కరీంనగర్]

ఉంటారు?" అంటూ ఒకటే ప్రశ్నలు రజిత.

"అవునమ్మా! నీ కున్నట్లే, మాకూ బామ్మ ఉంది. నీకు మీ బామ్మ చెప్పినట్లే మాకూ మా బామ్మ చిన్నప్పుడు కథలు చెప్పేది, కబుర్లు చెప్పేది. మేం స్కూలు నుండి రాగానే ఆ రోజు జరిగినవన్నీ మా మామ్మకి చెప్పేవాళ్లం నీలాగానే."

రజితకి వాళ్ల బామ్మంటే చాలా ఇష్టం.

"అత్తయ్యా! ను వ్వెప్పుడైనా పల్లెటూళ్లు చూశావా? పల్లెటూళ్లు బోర్‌గా ఉంటాయా? మా బామ్మేమో పల్లెటూళ్లు చాలా బాగుంటా యంటుంది."

"మా చిన్నప్పుడు మా బామ్మ పల్లెటూళ్లోనే ఉండేది. సెలవులకు మా బామ్మ దగ్గరికి వెళ్లేవాళ్లం. పల్లెటూళ్లలో పండుగల సందడి మరి చెప్పనక్కరలేదు! భలే మజాగా ఉంటుందిలే! అందులో సంక్రాంతి మరీను. ఇంటినిండా పెద్ద పెద్ద ముగ్గులు, మామిడాకు తోరణాలు, బంతిపూల తోరణాలు. భోగినాడు భోగిమంటలు, రకరకాల పిండివంటలు. పెద్దపండగనాడు ఆరుబయట పొంగళ్లు వండడం, పెద్దవాళ్లు పసుపు కుంకాలు పంచడం, కనుమనాడు ఎడ్లబండ్ల పందాలు, ధనుర్మాసం ఉదయాన్నే ఆవుపేడతో గొబ్బెమ్మలు పెట్టడం, వాటికి గుమ్మడి పూలు గుచ్చి పూజ చేయడం, సందె గొబ్బెమ్మలని పెట్టి పిల్లల లందరూ గొబ్బి పాటలు పాడటం, రథసప్తమినాడు చిక్కుడు కాయల రథాలు, చిక్కుడాకుల్లో ప్రసాదం - ఒకటేమిటీ? " ఇవన్నీ వివరంగా చెబుతుంటే అసలే పెద్ద కళ్లు రజితవి - వాటిని మరింత విప్పార్చి ఆశ్చర్యంగా వినేది.

నిజం చెప్పొద్దూ, రజితకు చెబుతుంటే ఆ రోజులు గుర్తొచ్చి ఎంత తన్మయత్వంగా ఉంటుందో చెప్పడం కష్టం! వేసంగి సెలవులు వస్తే కసురుమావిడి పిందెలు రాళ్లు కొట్టి రాలగొట్టి తినడంలో మజా, మామిడి కాయలు పండాయో, లేదో అని మాటిమాటికీ కావిడిపెట్టె తీసి చూడడం, లేత తాటిముంజెల కోసం ఎగబడటం, కసురు జామకాయలు, కసురు సపోటా పిందెలు కోసేసి తియ్యగా ఉన్నాయని తృప్తిపడి తినడం. అంత చక్కటి బాల్యం ఇప్పు డెంతమంది పిల్లలకు దొరుకుతోందీ! శివుడూ, తనూ బాదం కాయలకు దెబ్బలాడుకోవడం, బామ్మ వచ్చి విడిపించి కథలు చెప్పి మరిపించడం - నిజంగా ఈనాటి పిల్లలకు అటువంటి చక్కని అనుభవా లుంటాయనే తెలియదు!

ఫారెక్స్ కలిపి మణిని తీసుకెళ్లి అత్తగారి కిచ్చాను. మణిని సరిగ్గా ఒళ్లో కూర్చోబెట్టుకుంటూ, "రజిత మీ బామ్మని చూస్తా నంటోంది. ఎందుకే అంటే ఓ సారి చూసి వస్తాను అమ్మమ్మా అంటోంది" అన్నారు అత్తగారు.

"మూడు రోజులబట్టీ నన్ను అడుగుతోంది. ఇవాళ పొద్దున్నే మొదలుపెట్టింది. అందుకే మిమ్మల్ని అడగమని పంపించాను."

"పోనీ, వెళ్లిరండి! దానికీ తోచడం లేదు కాబోలు, మీ బామ్మముని మనవడి కోసం ఎదురు చూస్తూంటుంది కూడాను. పదిరోజులయినట్టుందిగా చూసి!" మనవడికి ఫారెక్స్ తినిపిస్తూ అన్నారు అత్తగారు.

రజితా, నేనూ తయారై వచ్చేసరికి మణి ఫారెక్స్ తినడం పూర్తయింది. మణికి పదో నెల. అయిదవ నెలలో అత్తవారింటికి పంపుతూ, ప్రతి పది రోజుల కొకసారి మునిమనవడిని చూపించమని మా అత్తగారిని కోరింది బామ్మ.

"ఊళ్లోనే కదా! అదేమంత భాగ్యం, అలాగేలెండి!" అన్నారు అత్తగారు అందుకని తరచు వెళ్తూనే ఉంటాను.

అత్తగారు - "రజితా! అక్కడ అల్లరి పెట్టకు. ఉంటే సాయంత్రందాకా అత్తయ్యతో ఉండు. ఇంటికి వచ్చేయాలనిపిస్తే అత్తయ్య తమ్ముడితో పంపిస్తుంది, వచ్చేయ్! అంతేకానీ పేచీలు పెట్టకు. ఎండలో అత్తయ్యని రమ్మనకు. మణిని ఎండలో తిప్పకూడదు" అంటూ రకరకాలుగా బోధపరిచి పంపించారు.

రజిత స్వతహాగా అల్లరి పిల్ల కాదు. చెప్పింది అర్థం చేసుకుంటుంది. బుద్ధిగా అమ్మమ్మకి తల ఊపి అల్లరి పెట్టను అని చెప్పి మరీ బయలుదేరింది.

ఇద్దరం వెళ్లేసరికి మా బామ్మ గుమ్మంలోనే ఎదురైంది.

"రావే, అమ్మడూ! నీకు నూరేళ్లాయుస్సు! ఇప్పుడే తలుచుకుంటున్నాను పిల్లది ఇంకా రాలేదూ, ఈమారు లేటయింది. 'పిల్లవాడికి నలతగాని చేసిందా' అని. ఫోను చెయ్యరా, శివా అంటే 'నిన్న సాయంత్రం అందరూ బాగున్నారని చెప్పింది కదా! సాయంకాలం దాకా ఆగు!' అంటాడు. అలా మాటిమాటికీ ఫోన్ చేస్తే మీ అత్తారు ఫోన్ తీయించి పారేస్తారు. అప్పుడు అసలు విషయాలు తెలియవు జాగ్రత్త' అంటూ బెదిరిస్తున్నాడే! గలగలా మాట్లాడుతూ ముని మనవడిని ముద్దులతో ముంచెత్తింది.

వాడు కాస్తా ఆలాపన అందుకుని అందరినీ పిలిచేశాడు. అమ్మా, తమ్ముడూ బయటకు వచ్చి పలకరించి మణిని అందుకోవడం, మణి మావయ్య దగ్గర కెళ్లగానే టక్కున నోరు మూశాడు. అది చూసి శివ కాల రెగరేశాడు.

బామ్మ - "చాల్లే, సంబడం! వేలెడంత లేని వెధవకి జాతి పక్షపాతం చూడు!" అని ముద్దుగా కసురుకోవడం - అన్నీ వింతగా చూస్తోంది రజిత.

"మీ ఆడబడుచు కూతురేమిటే ఈ అమ్మాయి?" అని అడిగింది అమ్మ.

"అవునమ్మా!" అని అమ్మకి జవాబిచ్చి, "బామ్మా! నిన్ను చూడాలని నీ కోసం వచ్చింది రజిత" అని రజితను చూపించి, "అదుగో చూశావా, ఈవిడే మా బామ్మ!" అని చూపించాను.

బామ్మ పక్కన చేరి కబుర్లు మొదలెట్టింది రజిత. అయిదు నిముషాల్లో ఇద్దరూ ఆత్మబంధువులైపోయారు. మరో అయిదు నిముషాలకు "నీ ఆడపడుచు కూతురు. తెలివైంది, చురుకైంది" అన్న సర్టిఫికెట్టు ఇచ్చేసింది బామ్మ.

కాసేపటికి "బాబాయి" అంటూ వరస కలిపి శివతో చేరిపోయింది. ఇద్దరూ కలిసి ఇంట్లో ఉన్న గేమ్స్ అన్నీ ఆడేశారు. కాసేపు పాటలు విన్నారు. మొత్తంమీద రోజంతా సరదాగా గడిపేసింది రజిత.

సాయంకాలం అయింది. "పదమ్మా ఇంటికెళ్దాం" అన్నారు రజితతో.

"అత్తయ్యా! ఇవాళ ఇక్కడుండి పోదాం. రే పెళ్దాం" అని మారాం చేయడం మొదలుపెట్టింది.

ఎంత బుజ్జగించి చెప్పినా వినలేదు. దానికితోడు బామ్మ సపోర్టు - "పిల్ల సరదా పడుతుంటే ఉండనీ, రేపు శివ దింపుతాళ్లే" అంటూ.

ఇక చేసే దేం లెక అత్తగారికి ఫోన్ చేద్దామని రింగ్ చేశాను. గబుక్కున నా చేతిలో ఫోన్ లాక్కుని, "అమ్మమ్మా! నే నివాళ ఇంటికి రాను. రేపొస్తాను. శివ బాబాయి దింపుతా డు!" చెప్పేసి, ఫోన్ నా చేతిలో పెట్టి తుర్రుమంది.

మా అత్తగారు చేసే దేం లేక, "పిల్లది వదిలి రాకు. ఇద్దరూ కలిసి రేపు రండి!" అని ఫోన్ పెట్టేశారు.

విషయం విని అమ్మా బామ్మా సంబరపడుతుంటే తమ్ముడు నెత్తిన చేతులు పెట్టుకుని సోఫాలో కూలబడి, "అక్కా! ఈరోజు బావగారికి సుఖ నిద్ర, మా ముఖాన కలత నిద్ర రాసినట్టున్నాడే వారఫలాల్లో!" అన్నాడు విచారంగా.

మణి పక్క తడిసిందంటే చాలు, గట్టిగా ఏడుస్తాడు. ఎంతటి కుంభకర్ణులకైనా తెలివి రావలసిందే. రాత్రి రెండు మూడు సార్లు నిద్రాభంగం తప్పనిసరి.

రజిత బాగా కలిసిపోయింది. అందరితోటీ సరదాగా కబుర్లు చెబుతోంది. శివతో పోటీపడి తనకు వచ్చిన జోక్స్ చెబుతోంది.

ఉన్నట్లుండి, "బాబాయ్! నీకూ మీ బామ్మంటే ఇష్టమేనా?" అని శివని అడిగింది రజిత.

"అబ్బో! చాలా ఇష్టం" అంటూనే బామ్మ మెడ చుట్టూ రెండు చేతులూ వేసి, "చూశావా ఇంతిష్టం" అన్నాడు.

"భడవకానా! చెయ్యి తియ్యి! పెళ్లీడు వచ్చింది. రేపో, మాపో పెళ్లయ్యాక మీ ఆవిడ ముందు కూడా ఇలాగే గారాలు పోతే అటకులు కట్టగలదు జాగ్రత్త!" నవ్వుతూ కోప్పడింది బామ్మ.

రజిత అటూ ఇటూ దిక్కులు చూస్తోంది. ఇంతలో అమ్మ లోపలి నుండి రావడం గమనించి, "బాబాయ్! దూరం జరుగు, మీ అమ్మ వస్తోంది" అంది గబగబా.

"ఏం వస్తే రానీ!" అన్నాడు శివ నిబ్బరంగా.

"బాబాయి! నీకు తెలియదు, బామ్మల దగ్గర ఉంటే అమ్మలకి నచ్చదు. మా మమ్మీయే కాదు, మీనా లేదూ - మా ఫ్రెండ్! వాళ్ల మమ్మీ కూడా అంతే. ఎక్కువసేపు బామ్మ దగ్గరుంటే కోప్పడుతుంది."

రజిత మాటలకు అందరం ఒక్కసారి ఉలిక్కిపడ్డాం. మాటిమాటికీ బామ్మ గురించి అడగడంలో అంతరార్థం లీలగా బోధపడింది నాకు. నేను నా చిన్నప్పటి ముచ్చట్లు చెప్పి తప్పు చేశానా అని ఒక్క క్షణం మథనపడ్డాను. రజిత ఏ ఉద్దేశంతో అడుగుతోందో తెలియక బామ్మంటే మరింత ఆసక్తిని పెంచానేమో! నేను ఆలోచనలో సతమతమవుతుండగానే శివ టాపిక్ మార్చేశాడు.

ఇద్దరూ కలిసి అంతాక్షరి ఆడుతున్నారు.

మళ్లీ అటువంటి ప్రసక్తి రాకుండా అందరం జాగ్రత్తపడ్డాం. పొద్దున్న లేస్తూనే మా అమ్మదగ్గర చేరి జడకుచ్చులు పెట్టి జడ వేయించుకుంది,



## ఇద్దరిదీ ఒకే రంగం కానీ

అతడు ప్రతిభావంతుడైన విజ్ఞాని. అంతేకాదు, అతడు శ్రేష్ఠుడైన కళాకారుడు కూడా. అతడు ఒకసారి ప్రొఫెసర్ సి.వి. రామన్‌గారి భావ చిత్రాన్ని రచించి వారికి సమర్పించారు. సి.వి. రామన్ దానిని ఎంతో మెచ్చుకోలుగా చూడసాగారు. ఆ సమయంలో ఆ చిత్రాన్ని గీసిన చిత్రకారు డిలా అన్నాడు - "ఇది ఒక విజ్ఞాని చిత్రం. ఇంకొక విజ్ఞాని చిత్రించాడు" అని.

సి.వి. రామన్ వెంటనే, "క్షమించండి! మీరు చెప్పేది తప్పు. ఇదొక కళావిదుని చిత్రం. ఇంకొక కళాకారుడు చిత్రించాడు" అని అన్నారు.

ఆ చిత్రాన్ని చిత్రించిన చిత్రకారు డెవరో తెలుసా?

జహంగీర్ హోమీ బాబా!

సేకరణ : చాగాపురం నాగేశ్వరరావు [గద్వాల]

గొరింటాకు పెట్టించుకుంది. సాయంత్రం వరకు సరదాగా గడిపేసింది.

మా ఇల్లు చేరిన గంటకు మా ఆడపడుచు ఊరి నుంచి వచ్చేసింది.

"హమ్మయ్య! వెళ్లిన పనైంది" అని సంతోషంగా చెప్పిన మా ఆడపడుచు వైపు ఒక్క క్షణం నిశితంగా చూసి, మౌనంగా తన పని చేసుకుంటున్నారు మా అత్తగారు.

నా కైతే మా ఆడపడుచు ఏ పనిమీద వెళ్లిందో తెలియదు. తెలిసిన మా అత్తగారు ఆవిడ స్వభావానికి విరుద్ధంగా ఎందుకు ప్రవర్తిస్తున్నారో అంతకంటే అర్థం కాలేదు.

ఆ రాత్రి భోజనాలయ్యేవరకూ అందరూ మౌనంగానే ఉన్నారు. భోజనాల సమయంలో కూడా రోజులా కబుర్లు లేవు - కావలసినవి అడగడం తప్ప. నాకైతే అంత అయోమయంగా ఉంది. చెప్పొద్దూ, కొద్దిగా మనసులో భయంభయంగా ఉంది. అందుకే అందరూ హాల్లో సమావేశమైనా మణిని పడుకోబెడుతూ గదిలోనే ఉండిపోయాను.

మౌనాన్ని ఛేదిస్తూ, "నీ నిర్ణయం నాకు నచ్చలేదమ్మాయి!" అన్న మామగారి కంఠం గదిలో ఖంగుమంది.

"మీ రలాగే అంటారు నాన్నగారూ! నా బాధ మీ కేం తెలుసు?"

"మీ బామ్మ ఎలాగుండేదో ఎరుగవా? మీ అమ్మని ఎన్నెన్ని మాట లనేది? ఆఖరాఖరికి తన బలహీనతకు కోపం వచ్చి మీ అమ్మని నానా తిట్లూ తిట్టేది. అయినా ఒక్కనాడు విసుక్కుందా? నీలాగే ఆలోచించిందా? మా కడుపున పుట్టిన నీవు తల్లీ కొడుకులను వేరు చేయాలని చూస్తూంటే బుద్ధి చెప్పడం మా బాధ్యత కాదా!"

"అమ్మ సహించిం దని నేనూ సహించాలా! ఆవిడ తరం వేరు, మా తరం వేరు. ఎవరు ఇంటికి వచ్చినా తగుదునమ్మా అంటూ తయారు. రజిత స్కూలు నుంచి వచ్చింది లగాయితు, రాత్రి పడుకునేదాకా దానికి కథలూ, కబుర్లూ చెబుతూ దాని టైమంతా పాడుచేస్తుంది. దానికి మరి చదువు, హోంవర్క్ అక్కరలేదు. ఇంటికి ఎవరొచ్చినా ఆరాలు కావాలి. ఇక తిండిలో రకరకాల రుచులు కావాలంటుంది. ఎప్పుడూ ఏదో ఒకటి గొణుగుతూనే ఉంటుంది. ఆవిడవల్ల నా స్నేహితుల ముందు పరువు పోతోంది. నా బాధలు విని మా ఆయనే 'నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి' అని పర్మిషన్ ఇచ్చేశారు. అయినా ఇది మా ఇంటి సమస్య. ఎలా పరిష్కరించుకోవాలో మాకు తెలుసు. దాన్ని గురించి మీరు, అమ్మ ఎందుకంత బాధపడుతున్నారో అర్థం కాదు." - తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పింది మా ఆడపడుచు.

"అమ్మా! బామ్మని పంపించేస్తున్నావా?" అడిగింది రజిత.

"అవునమ్మా! 'వృద్ధుల నిలయం అని ఉంది. అంటే బామ్మల హోమ్ అన్నమాట. అందులో అందరూ బామ్మ వయసువాళ్లే ఉంటారు. నీకు ఎంచక్కా నా వయసు ఫ్రెండ్స్ ఉన్నారు కదా! నా కేమో బోలెడుమంది ఆంటీలు నా వయసువారు వస్తారు కదా! మనం అందరితో కలిసి తిరగ్గలం. స్నేహితుల్ని సంపాదించుకోగలం. మరి మీ బామ్మ మనలా తిరగలేదు కదా! అందుకని హోమ్‌లో ఉంటుంది. తన వయసు వాళ్లతో కలిసి సరదాగా గడుపుతుంది. మనం కావలసినప్పుడల్లా వెళ్లి చూసిరావచ్చు!" నచ్చచెప్తున్న ధోరణిలో ఎంతో అనునయంగా చెప్పింది మా ఆడపడుచు.

"అయితే ..." ఏదో అడగపోతున్న రజితను విసుగ్గా చూస్తూ, "మళ్లీ ప్రశ్నలు వేయకు. మీ బామ్మని పంపిస్తున్నాను. అంతే!" అంది.

తల్లి కంఠంలోని తీవ్రతకు బెదిరి, "నిన్ను కాదులే!" అని, అమ్మమ్మ వైపు తిరిగి, "అమ్మమ్మా! మణికి కూడా పదేళ్లు వస్తే నువ్వు కూడా బామ్మల హోమ్‌కి వెళ్తావా?" అని అడిగింది.

ఎవరూ జవాబు చెప్పకపోవడంతో "తాతయ్యా! అందరూ బామ్మలవుతారా!" అని అడిగింది.

రజిత తల నిమురుతూ దగ్గరకు తీసుకుని "అవుతారమ్మా!" అన్నారు మా మావగారు.

"మరి అమ్మ కూడా బామ్మవుతుందా తాతయ్యా!"

"అవదమ్మా! నీకు అన్న తమ్ముడు లేరు కదా!"

"హమ్మయ్య! బతికింది. లేకుంటే బామ్మయితే బామ్మల హోమ్‌కి వెళ్లాలి, అక్కడే ఉండాలి కదా!" తల తిప్పుతూ గుమ్మం దగ్గర మోడా మీద కూర్చున్న నన్ను చూసి, మళ్లీ తాతగారి వైపు తిరిగి, "తాతయ్యా! అత్తయ్యా వాళ్లు ఇంత పెద్దయినా వాళ్ల బామ్మని బామ్మల హోమ్‌లో ఎందుకు చేర్పలేదు? వాళ్లకి బామ్మ లెక్క డుండాలో తెలీదా?"

రజిత ప్రశ్నలకు ఏం జవాబు చెప్పాలా అని ఆలోచనలో పడ్డారు మా మావగారు.

ఇంతలో మావారు కల్పించుకుని, "నీ ప్రశ్నలన్నింటికీ మీ అమ్మే చక్కటి జవాబులివ్వగలదు. అందుకని మీ అమ్మ మూడ్ బాగున్నప్పుడు మీ అమ్మనే అడుగు" అన్నారు.

"అక్కా! నీ కూతురి ప్రశ్నలకు ఆలోచించి జవాబులు చెప్పు. సమస్య నీది! నిజమే, కాదనడంలేదు. కాని ఆవిడ బావగారికి తల్లి. ఆయన నీ ఇష్టం అన్నంత మాత్రాన నిజంగానే నీ నిర్ణయాన్ని హర్షిస్తారా అన్నది మరోమారు ఆలోచించు."

అంతవరకు నిశ్శబ్దంగా ఉన్న అత్తగారి మనసులోని ఆవేశం లావాలా పైకుబికింది.


"అదెందుకు ఆలోచిస్తుందిరా? అయిన కూతురు అయితే అయింది గాని, సిటీల్లో శాటిలైట్ మహిళామండలి సభ్యురాలై ఆడవాళ్లు అష్టకష్టాలు పడుతున్నారంటూ అట్టలుచ్చుకుని తిరగడం, పార్టీలు, సరదాలు, పేకాడటం - వీటికే టైమ్ చాలదు. నాలుగు వేల రూపాయల చీర నలిగితే కష్టం అని బాధపడేవాళ్లకు నలిగిన మనసుల బాధ లేం తెలుస్తాయి. భర్త హోదాలని చూసి గర్వపడే వీళ్లకు నిజంగా కష్టం అంటే తెలుసా?

"అత్తగారు వృద్ధుల నిలయంలో తన వాళ్లెవరూ లేక ఒంటరిగా కాలం గడుపుతూ, మానసికంగా కృంగిపోతుంటే ఆవిడ ఆడది కాదు, అది కష్టం కాదు! పనిమనిషి కాస్త ఆలస్యంగా వస్తే అంతెత్తున ఎగిరిపడేదానికి అది ఆడది కాదు - దానికి కష్టా లుండవు. ఇటువంటి వాళ్లు లోకోద్ధరణకు పూనుకుంటున్నారు. మిధ్యా ప్రతిష్ఠతో బతికేవాళ్లకి మనసులు, మమతలు అంటే అర్థం ఎలా తెలుస్తుందీ!" మరి అక్కడ నిలవలేక గబగబా వెళ్లిపోయారు అత్తగారు.

అందరూ ఎవరి మానాన వాళ్లు లేచి వెళ్లిపోయారు.

నేను లేచి మణి పక్కన సర్దుకుని పడుకున్నాను. మౌనంగా ఉన్న శ్రీవారిని పలకరించే ధైర్యం చేయలేక కళ్లు మూసుకున్నా పదేపదే రజిత అడిగిన ప్రశ్న 'బామ్మ లెక్కడ ఉండాలి?' నా ఆలోచనల్లో సుళ్లు తిరుగుతూనే ఉంది.

★



**ఈతరాదుగా!**

స్నేహితుడైన సుబ్బారావు కూతురికి సంబంధం తీసుకొచ్చాడు అప్పారావు.

కుర్రాడు ఆర్టీసీ డ్రైవర్‌గా చేస్తున్నాడని చెప్పాడు. విషయాలన్నీ మాట్లాడుకున్న తర్వాత సంబంధం వద్దన్నాడు సుబ్బారావు.

"ఇంత మంచి సంబంధం ఎందుకు వద్దంటున్నావో అర్థం కావటం లేదు"

"అర్థాంతరంగా అమ్మాయి భవిష్యత్తు నాశనం కాకూడదని"

"అబ్బాయి మంచివాడేరా. త్వరలో ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌గా ప్రమోషన్ కూడా వస్తుంది."

"అయినా ఏం లాభం. కుర్రాడికి ఈత రాదట!"

షా, నల్లగొండ

